క్లుప్తంగా

ఆర్థికసాయం



ఐనవోలు: మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన వడ్లకొండ యాదగిరి ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. నాయకులు తాడి కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తక్షణ సాయం కింద బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం రూ. 25వేలు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు కందాల శంకరయ్య, రజినీకాంత్, చిర్ర వెంకటస్వామి, బుర్ర రాజశేఖర్, గడ్డం శ్రీనివాస్, సురేందర్, కుమారస్వామి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈజీఎస్ పనులపై సమావేశం

దామెర: ఎన్ఆర్ఈజీఎస్ పనులపై మండల ఓపెన్ ఫోరం సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ కల్పన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నాలుగో విడత సామాజిక తనిఖీ భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఓపెన్ ఫోరం ప్రారంభమవుతుందని ఆమె పేర్కొన్నారు. సమావేశానికి మండల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రత్యేక అధికారులు హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

దేవస్థాన భూములను పరిరక్షించాలి

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతం, ఆక్రమణకు గురవుతున్నాయని, దేవస్థానం భూములకు హద్దులు నిర్ణయించి భూములను పరిరక్షించాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అదారి శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు సోమవారం వినతిపత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట సీపీఐ నాయకులు మంచాల రమాదేవి, కొంగల రామచంద్రారెడ్డి, తిరుపతి, రమేష్, టేకుమట్ల కుమారస్వామి, బాబు, పప్పు రాజమొగిళి తదితరులు ఉన్నారు.

చేయూత

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన శ్రీరామోజు పరమేశ్వరచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా 1999–2000 సంవత్సరంలో పరమేశ్వర చారితో చదువుకున్న స్నేహితులు సోమవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10వేల నగదు, క్వింటాల్ బియ్యాన్ని, ఇతర సామగ్రి అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. అందజేసిన వారిలో బాసాని శ్రావణ్, రంజిత్‌కుమార్, కందగట్ల మహేష్, సంతోష్, గాజే రాజేందర్, మార్త సుమన్, నల్లెల్ల ఈదేందర్, సతీష్ ఉన్నారు.

పరామర్శ

ఆత్మకూరు : మండలంలోని నాగయ్యపల్లెలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాదాసి వీరలక్ష్మి కుటుంబాన్ని అస్సైన్డ్‌భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ సోమవారం పరామర్శించి కుటుంబసభ్యులను ఓదార్చి ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, సత్య, భిక్షపతి, మాదాసి రాజు, శ్రీనివాస్, భాస్కర్, అశోక్, సుదర్శన్, నవీన్, ప్రమీల, సౌమ్య, జ్యోతి తదితరులు ఉన్నారు.

చెట్లతోనే మానవ మనుగడ



ఎల్కతుర్తి: చెట్లతోనే మానవ మనుగడ సాధ్యపడుతుందని, వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు విరివిగా మొక్కలు పెంచాలని వైద్యాధికారి డాక్టర్ ముతార్ రహమాన్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం భీమదేవపల్లి మండలం వంగర ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో డాక్టర్ రుబీనా, వైద్య సిబ్బంది కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఐదేసి మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కేఎల్ఎన్ స్వామి, సృజన, స్వర్ణలత, మౌనిక, పద్మ, రజిత, సుధీర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని అధ్యాపకులు కోరారు. ఈమేరకు కేయూ పాలకమండలి సభ్యుడు డాక్టర్ చిర్ర రాజును సోమవారం కలిసి విన్నవించారు. ఫుల్‌టైం వర్క్‌లోడు గల కాంట్రాక్టు లెక్చరర్లుగా నియమించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం ఆయనను సన్మానించారు.

అంగన్‌వాడీల్లో సౌకర్యాలు కరువు

- విద్యుత్ సౌకర్యం లేక వంటకు అవస్థలు
- పిల్లలు ఆడుకోవడానికి వసతులు లేవు
- మండలంలో 7 సెంటర్లకే పక్కా భవనాలు



ఆత్మకూరులోని అంగన్‌వాడీ సెంటర్



చీకట్లో వంట చేస్తున్న ఆయా

ఆత్మకూరు : మండలంలో అంగన్‌వాడీ సెంటర్లు వసతులు లేక అసౌకర్యాల మధ్య నడుస్తున్నాయి. వసతులు లేకపోవడంతో ఇటు పిల్లలు, అటు సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పూర్వ ప్రాథమిక విద్యను క్రీడా పద్ధతిలో అందించాల్సిన అంగన్‌వాడీ సెంటర్లలో సరైన సౌకర్యాలు లేకపోవడం చిన్నారుల విద్యకు ఆటంకం కలిగిస్తున్నాయి. మండలంలో అక్కంపేట సెక్టార్‌లో 20, ఆత్మకూరులో 24 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. మండలంలో మొత్తం 44 సెంటర్లు ఉన్నాయి. ఇందులో అక్కంపేట సెక్టార్‌లో అక్కంపేట-1, పెద్దాపూర్-1, లింగమడుగుపల్లె-1 ఆత్మకూరు సెక్టార్‌లో ఆత్మకూరు-1, గుడెప్పాడ్-2, తిరుమలగిరి-1 ఇలా మొత్తం 7 సెంటర్లకు మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. ఆత్మకూరు సెక్టార్‌లో ఆత్మకూరు-4, నీరుకుళ్ల- 3, పెంచికలపేట-2 మొత్తం 9 సెంటర్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మిగతా 28 సెంటర్లు రెండు సెక్టార్లు ప్రభుత్వ పాఠశాలల్లో నడుస్తున్నాయి. అంగన్‌వాడీ సెంటర్లలో విద్యను అందించడంతో పాటు పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం చేయడం జరుగుతుంది. సెంటర్లలో వంట చేయడానికి విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో చాలీచాలని వెలుతురు, చీకట్లోనే వంటలు చేయాల్సి వస్తుంది. దీంతో ఆయాలు, టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీకట్లో వంటలు చేయడం వల్ల ఆహార పదార్థాల్లో ఏమైనా కీటకాలు పడితే ఫుడ్‌పాయిజన్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా అంగన్‌వాడీ సెంటర్లలో సౌకర్యాలు మెరుగుపర్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

మండలంలోని అంగన్‌వాడీ సెంటర్ల పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వీలైనంత త్వరలోనే సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తాను.

– పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

పాఠశాలకు టీచర్ డుమ్మా

- సెలవు మంజూరు చేయకున్నా విధులకు హాజరు కాని ఉపాధ్యాయురాలు
- గైర్హాజర్‌తో పాఠశాలకు రాని విద్యార్థులు



విధులకు టీచర్ హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

శాయంపేట : పిల్లలకు క్రమశిక్షణ అలవాటు చేస్తూ విద్యాబుద్ధులు బోధించాల్సిన ఉపాధ్యాయురాలు క్రమశిక్షణ తప్పి సెలవు మంజూరు కానప్పటికీ విధులకు గైర్హాజరైంది. టీచర్ పాఠశాలకు రాకపోవడంతో విద్యార్థులు కూడా పాఠశాలకు ఎగనామం పెట్టారు. వివరాల్లోకి వెళ్లితే.. మండలంలోని అప్పయ్యపల్లె ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఏకోపాధ్యాయురాలు పోరిక రమాదేవి సోమవారం చైల్డ్ కేర్ సెలవు కోసం దరఖాస్తు పెట్టింది. సెలవు మంజూరు కానప్పటికీ ఆమె విధులకు గైర్హాజరైంది. సోమవారం పాఠశాలను సాక్షి సందర్శించగా పాఠశాల తెరిచి ఉన్నప్పటికీ టీచర్‌తో పాటు విద్యార్థులు కూడా పాఠశాలకు హాజరు కాలేదు. పాఠశాల ప్రాంగణంలోని అంగన్‌వాడీ టీచర్‌ను అడుగగా టీచర్ రాలేదని ఆమె రాకపోవడంతో విద్యార్థులు కూడా రాలేదని తెలిపింది. ఇదే విషయమై పత్తిపాక కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు మాధవిని వివరణ కోరగా రమాదేవి ఎంఈఓకు చైల్డ్‌కేర్ లీవ్ కోసం దరఖాస్తు చేసుకుందని అదే కాపీని తనకు పంపించిందని తెలిపారు. సెలవు ముందే మంజూరు చేయించుకోవాలని సెలవు మంజూరు కాలేదని తెలిపారు. సెలవు మంజూరు కాకుండానే విధులకు రాకపోవడంతో ఆబ్సెంట్ పడి జీతం నుంచి కట్ అవుతుందని తెలిపారు.

మెమో జారీ చేస్తా..

సెలవు కోసం దరఖాస్తు చేసుకోగా సెలవు మంజూరు కాకుండానే విధులకు గైర్హాజర్ కావడంతో ఆమెకు మెమో జారీ చేస్తాం. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు మాధవి అప్పయ్యపల్లె టీచర్ గైర్హాజరైన విషయంపై సమాచారం ఇచ్చింది. ఆమెకు ఎలాంటి సెలవు మంజూరీ చేయలేదు. ఆమెపై చర్య తీసుకుంటాం.

– రమాదేవి, ఇన్‌చార్జ్ ఎంఈఓ

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్లు

దామెర : జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో మండల కేంద్రం సమీపంలోని శ్రీహర్ష పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్లు వెంకటరాజు, శివానంద్ సోమవారం తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రూరల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో అండర్ 14, 17 విభాగాల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు వారు పేర్కొన్నారు. విజేతలైన విద్యార్థులను డైరెక్టర్లు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడంపై హర్షం వ్యక్తం చేశారు. మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, పీఈటీ రవీందర్, సురేశ్, రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ధ్వంసం



హన్మకొండ (పరకాల): పరకాల అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు నల్లరంగు పూసి ధ్వంసం చేశారు. ఈ ఘటన జరిగి చాలా రోజులు అవుతున్న విషయం బయటకు పొక్కకుండా మున్సిపల్ సిబ్బంది గ్రీన్ మ్యాట్ చుట్టారు. ఎందుకు చుట్టారనే విషయంపై సాక్షి ఆరా తీయగా కొందరు ఆకతాయిలు గాంధీ విగ్రహానికి నల్లరంగు పూసి స్వల్పంగా ధ్వంసం చేసినట్లు తెలిసింది. పరకాలలో ఆకతాయిల ఆగడాలకు హద్దు..అదుపు లేకపోవటానికి ఈ ఘటన ఓ కారణం. ప్రజా సంఘాల నాయకులు కూడా పట్టించుకోకపోవడం విశేషం.

అవెన్యూ ప్లాంటేషన్ చెట్ల నరికివేత



నరికి వేసిన అవెన్యూ ప్లాంటేషన్ చెట్లు

శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారం నుంచి నేరేడుపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలోని అప్పయ్యపల్లి స్టేజీ సమీపంలోని మలుపులో ఉపాధి హామీ పథకంలో రోడ్డుకిరువైపుల నాటిన అవెన్యూ ప్లాంటేషన్‌లో పెరిగిన పెద్ద చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. ఏపుగా పెరిగిన 15కు పైగా కానుగ చెట్లను నరికి రోడ్డు పక్కన పడవేసి ఉండడంతో సోమవారం సాక్షి క్లిక్ మనిపించింది. గత ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులతో హరితహారం కార్యక్రమంలో మొక్కల పెంపకం చేపట్టగా పెద్ద వృక్షాలుగా ఎదిగిన వాటిని గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేయడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినట్లు అవుతుందని ప్రజలు చర్చించుకోవడం గమనార్హం. ఇప్పటికైనా గ్రామ ప్రత్యేక పాలన అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి చెట్ల నరికివేతను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మండల పంచాయతీ అధికారిని వివరణ కోరగా చెట్ల నరికివేత విషయం తనకు తెలియదని దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నాయబ్ తహసీల్దార్‌పై కేసు నమోదు చేయాలి



తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఐనవోలు: కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం నాయబ్ తహసీల్దార్‌పై కేసు నమోదు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.మల్లయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ తాడ్వాయి మండలం రికార్డు అసిస్టెంట్ తెడ్డు ప్రశాంత్ నాయబ్ తహసీల్దార్ వేధింపుల వల్లే చనిపోయాడని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అతనిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సూరజ్, గోపి, రమేష్, సాంబరాజు, మోహినుద్దీన్, విజయ, జయశ్రీ, ఐలయ్య, కృష్ణ, వేణు, సదానందం తదితరులు ఉన్నారు.

ఒత్తిడిలేని విద్య అందించడమే లక్ష్యం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతారెడ్డి



శాయంపేట : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

శాయంపేట : ఒత్తిడి లేని విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతా రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఈనెల 15 నుంచి 20 వరకు 6 రోజుల పాటు నిర్వహించనున్న అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో పిల్లలకు విద్యను అందించడమే కాక వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు ఉన్నారా అని కూడా పరిశీలిస్తూ వారి ఆరోగ్య పరిస్థితిని ప్రతి నెలా చూడడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సుధాకర్, అంగన్‌వాడీ టీచర్లు జ్యోత్స్న, శ్వేత, రత్నమాల, కవిత, రమ, పుష్ప, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండలంలోని కేశవాపూర్‌లోని రెండో అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మమాట..అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ఆసెంటర్ అంగన్‌వాడీ టీచర్ వసంత విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించి అధిక ఫీజులు చెల్లించవద్దన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు కావల్సిన ఆట పాట వస్తువులతో పాటు ఆంగ్లంలో రైమ్స్, చిన్నారులకు బుద్ధి, తెలివిని పెంచేందుకు పౌష్టికాహారం, పిల్లలకు కావల్సిన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. అనంతరం ప్రైవేట్ స్కూల్ వద్దు.. అంగన్‌వాడీ సెంటర్లే ముద్దు అని నినాదాలు చేశారు. ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజు, కాంగ్రెస్ నాయకుడు ఇనుగాల శ్రీనివాస్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లోనే చేర్పించాలి

కమలాపూర్: రెండున్నరేళ్ల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చేర్పించాలని ఐసీడీఎస్ భీమదేవరపల్లి ప్రాజెక్టు సీడీపీఓ స్వరూప కోరారు. ఈ నెల 15 నుంచి 20 వరకు నిర్వహించనున్న 'అమ్మ మాట–అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ స్థాయి పర్యవేక్షణ సహాయక కమిటీ సభ్యులు, ఆశ కార్యకర్తలతో కలిసి సోమవారం కమలాపూర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని స్టడీ మెటీరియల్‌తో పాటు అసెస్‌మెంట్ కార్డులు వంటివి తల్లిదండ్రులకు చూపిస్తూ అంగన్‌వాడీల్లో అందించే సేవలపై అవగాహన కల్పించారు. అంతకుముందు 'అమ్మ ప్రేమను ఇస్తుంది–అంగన్‌వాడీ అభివృద్ధి ఇస్తుంది' అనే నినాదాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ తెలంగాణ తల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అలాగే మండలంలోని కన్నూరు గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లు కవిత, రజిత ఆధ్వర్యంలో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, పద్మకుమారి, ఉమ, శ్రీలత, పూర్ణిమ, రజిత, తిరుమల, అంకూస్‌బీ,పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



కమలాపూర్ : కన్నూరులో..



కమలాపూర్ : ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీఓ స్వరూప



ఎల్కతుర్తి : కేశవాపూర్‌లో..

పొంచి ఉన్న ప్రమాదం



వంగి ప్రమాదకరంగా ఉన్న మర్రి చెట్టు

- పాఠశాల ప్రాంగణంలో ఒరిగిన మర్రి వృక్షం
- తొలగించాలని తల్లిదండ్రుల వేడుకోలు

శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 40 ఏళ్ల మర్రి వృక్షం ఒక వైపుకు ఒరిగి పడిపోవడానికి సిద్ధంగా ఉంది. విద్యార్థులు చెట్టు కింద ఆడుకునే సమయంలో చెట్టు పడిపోతే విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మర్రి వృక్షం ఏపుగా పెరుగుతుండడంతో దాని ఊడలను ఎప్పటికప్పుడు నరికి వేయించారు. చెట్టు పెద్దదిగా పెరిగిన ఊడలు లేకపోవడంతో బలమైన పునాది లేకుండా పోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు మర్రి చెట్టు ఒకవైపుకు ఒరిగి కూలడానికి సిద్ధంగా ఉంది. ఇప్పటికైనా గ్రామ ప్రత్యేక పాలన అధికారి స్పందించి విద్యార్థులకు ప్రాణనష్టం సంభవించకుండా కూలడానికి ఉన్న చెట్టును గ్రామ పంచాయతీ సిబ్బందితో కొట్టి వేయించాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

బ్యాటరీల దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేందర్

ధర్మసాగర్ : ఆగి ఉన్న ఉన్న వాహనాల బ్యాటరీలను చోరీలకు పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవు మండలం రంగనాయకపురం గ్రామానికి చెందిన ఒడిశెట్టి నాగేశ్వర్‌రావు ప్రస్తుతం సికింద్రాబాద్‌లో తల్లిదండ్రులతో నివాసం ఉంటున్నాడు. నాగేశ్వర్‌రావు జల్సాలకు, క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటుపడి అధిక డబ్బులు సంపాదించాలనే ఆశతో గత కొద్ది రోజులుగా ఎవరికి అనుమానం రాకుండా హైదరాబాద్‌లోని లాంగ్ డ్రైవ్ కార్స్‌లో కారును కిరాయికి తీసుకొని ధర్మసాగర్, చిల్పూర్, రఘునాథపల్లి, జనగామ, బచ్చన్నపేట, చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఆగి ఉన్న ట్రాక్టర్, ట్రిప్పర్ లకు సంబంధించిన బ్యాటరీల దొంగతనాలకు పాల్పడేవాడు. దాదాపు 25 బ్యాటరీలు రాంపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలోని ధనలక్ష్మి రైస్‌మిల్ వెనకాల గల చెట్ల పొదలో దాచిపెట్టినట్లు చెప్పారు. వీటి విలువ దాదాపు రూ.1.50 లక్షలు ఉంటుందని తెలిపారు. 12 బ్యాటలరీలను హైదరాబాద్‌లో అమ్మడానికై కారులో వస్తుండగా ధర్మసాగర్ పోలీసులు రాంపూర్ హైవే రోడ్డుపై వేగంగా వస్తున్న కారును తనిఖీ చేయగా బ్యాటరీలు ఉన్నట్లు గుర్తించారు. అతన్ని పట్టుకుని విచారించగా తాను 25 బ్యాటరీలను చోరీ చేసినట్లు అంగీకరించినట్లు పేర్కొన్నారు. కారులో ఉన్న 12 బ్యాటరీలను, మిగతా 13 బ్యాటరీలు ధనలక్ష్మి రైస్‌మిల్ వెనకాల ఉన్నట్లు అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని బ్యాటరీలను స్వాధీన చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తనిఖీలో ఎస్సైలు బండారు రాజు, నర్సింహారావు, ఏఎస్ఐ పోచయ్య సిబ్బంది సంపత్,కరుణాకర్ పాల్గొన్నారు.

పత్తిపాకలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- మురుగునీరును తలపిస్తున్న గేట్‌వాల్వ్
- కుప్పలు కుప్పలుగా పేరుకుపోయిన చెత్త
- పట్టింపులేని అధికారులు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పడేసిన చెత్త

శాయంపేట : మండలంలోని పత్తిపాకలో పారిశుద్ధ్యం లోపించింది. ఎక్కడ పడితే అక్కడ కుప్పలు కుప్పలుగా చెత్త పేరుకుపోయింది. ప్రజలకు మంచినీరు అందించే నల్లాల గేట్‌వాల్వ్‌లు మురుకునీటితో నిండిపోయాయి. డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలే కాలం కావడంతో ప్రజలు వణికిపోతున్నారు.పారిశుద్ధ్యం పడకేయడంతో పల్లెల్లో వ్యాధులతో ప్రజలు అవస్థలు పడతున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దోమలు స్వైరవిహారం విస్తరిస్తుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

మురుగునీరును తలపిస్తున్న గేట్‌వాల్వ్

మండలంలోని పత్తిపాకలో ప్రజలకు అందిస్తున్న మంచినీటి పైపుల గేట్‌వాల్వ్ మురుగునీరుతో నిండిపోయాయి. ప్రజల ఇళ్లలోకి మంచినీటి సరఫరా చేసినప్పుడు గేట్‌వాల్వ్ తిప్పడంతో అందులో ఉన్న మురికి నీరు పైపులోకి వెళ్లి తాగేనీరులోకి కలుస్తుంది. ఆ నీరు తాగిన ప్రజలు అనారోగ్యం బారిన పడే పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి గేట్‌వాల్వ్‌ను శుభ్రం చేసి నీటిని విడుదల చేయాలని ప్రజలు కోరతున్నారు.

పేరుకుపోయిన చెత్త

వర్షాకాలం ఆరంభంలోనే గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాల్సిన అధికారులు తాత్సారం చేస్తున్నారు. గ్రామంలో మురుగుకాల్వలు సరిగా లేవు. రోడ్లపై ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిలిచి దోమల బెడద ఎక్కువైందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త రోడ్లపైన ఎక్కడ పడితే అక్కడ కుప్పలు కుప్పలుగా ఉండడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. అధికారులు పారిశుధ్య పనులు అంతంత మాత్రంగా చేపడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి దోమల బెడద నుంచి సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.



గేట్‌వాల్వ్‌లో నిలిచిన మురుగునీరు